## కథానిక "దానం"*

### డాక్టర్ ఎ. విజయలక్ష్మి

"డాక్టరమ్మ గారు!" ప్రిస్క్రిప్షన్ వ్రాస్తున్న డాక్టర్ శారద తలెత్తింది.

"నువ్వా? బాగా చదువుతున్నావా బాబూ?" ఆదరంగా పలుకరించిం దతన్ని. చిన్నగా తలూపా డతను. డ్రాయర్ తీసి ఐదు రూపాయల నోటొకటి అతని చేతిలో పెట్టింది శారద. మాటలకందని ఏదోభావం అతని కళ్ళల్లో కదలాడుతూవుండగా చేతులు జోడించి సెలవు తీసుకున్నాడు. అనుకోకుండా శారదకు అతను మొదటిసారి తనను కలుసుకోవడం గుర్తొచ్చింది.

తను ఇంటర్మీడియట్ చదువుతున్నానని, తల్లీ తండ్రి తనని చదివించగల స్థితిలో లేరని, కొంతమంది ధర్మాత్ముల దయవల్ల తను చదువుకోగలుగుతున్నానని చెప్పి, తనను తోచిన సహాయం చెయ్యమన్నాడు. ఇలాంటి ఘరానా బిచ్చగాళ్ళ తెలివితేటలకు లొంగిపోయి డబ్బిచ్చేసేంత పిచ్చిది కాదు తను. వీడిని తెలివిగా వదిలించుకోవా లనుకుంది శారద. అంతలోనే మరో ఆలోచన కూడ వచ్చి ఆమెను ఒక్కక్షణం ఆగేలా చేసింది. ఇతను నిజంగా చదువుమీద ఆసక్తి వుండి కూడ డబ్బు లేకపోవడంవల్ల చదువుకోలేక పోతున్నాడేమో, ఇలాటివాళ్ళకు తను చెయ్యగలిగిన సహాయం చెయ్యడం తన ధర్మం కాదా! ఇంకా పసితనం వదలని యితని ముఖం ఒకరి ముందు చెయ్యి చాచవలసి వచ్చిందనే కించతో, నిస్సహాయతతో జాలి గొలిపేలా వుంది.

పాపం! ఎన్ని కష్టాలుపడి చదువుకుంటున్నాడో! ఎన్ని అవమానాలను దిగమ్రింగుకుంటున్నాడో!....కాని యిది నటనేమో, తనని నమ్మించడాని కిలా దీనంగా పెట్టాడేమో ముఖం!....ఛ! ఛ! సాటి వ్యక్తిని గురించి ఎంత హీనంగా ఆలోచిస్తూంది తను! డబ్బిస్తే యిస్తుంది, లేకపోతే లేదు. అంతే గాని అతని నిజాయితీని శంకించడానికి, అతనిని దగాకోరుగా, నీచంగా చిత్రించడానికీ ఏం అధికారంవుంది తనకు?

"చూడు బాబూ! నువ్వు అబద్ధాలు చెప్తున్నావని అనను కాని నువ్వు నిజమే చెప్తున్నావనడానికి ఆధారం కనపడడం లేదు. అంచేత మీ ప్రిన్సిపాల్‌గారితో నువ్వు పేద విద్యార్థివని ఒక్కముక్క కాగితం మీద వ్రాయించుకొచ్చావంటే, యీ ఒక్కసారి కాదు, నీ చదువయిపోయేంత వరకు నెలకు అయిదు రూపాయల చొప్పున యిస్తాను. అతను సంతోష సంభ్రమాలతో నమస్కరిస్తూ 'థేంక్స్' చెప్పి, ఆ సాయంకాలమే ప్రిన్సిపాల్ లెటర్ తీసుకొచ్చాడు.

అదంతా గుర్తుకొచ్చింది శారదకు. అప్పుడప్పుడు చదువుకుంటున్నాం, సహాయం చెయ్యమనో, పిల్ల పెళ్ళికి సాయం చెయ్యమనో, బ్రతికి చెడినవాళ్ళం, కుటుంబమంతా నాలుగు రోజుల్నుంచీ పస్తుంది, తమకు తోచిన ధర్మం చెయ్యమనో, వస్తూ వుంటారు. వీళ్ళల్లో ఎవరికివ్వాలో, ఎవరికివ్వగూడదో సందిగ్ధంగానే వుంటుంది శారదకు. తనిచ్చేది అపాత్రదానం కాకూడదని శారద కోరిక. అదే సమయంలో నిజంగా అవసరంలో వున్న వారిని తను నిరాశపరచ కూడదని, ఎంత స్వల్పంగానైనా సరే వారికి సహాయపడగలితేనే తన చదువుకు, సంపాదనకు సార్థకత అని అనుకుంటుంది. కాని

---

* పై కథ, యీ సంచికలోని కథలు 'అబల', 'చిల్లపెంకులు' జూన్ సభలో చదివినవి.

యిలా యివ్వడం తన తెలివితక్కువగా, బలహీనతగా భావించి ఎవరూ తనని మోసం చెయ్యకుండా జాగ్రత్తగా వుండాలని అనుకుంటుంది—తను యిలా యితరులకు సహాయపడాలని కోరుకోవడం కీర్తి కాంక్షతో కాదు గదా అనే ఆత్మవిమర్శ కూడ చేసుకుంటూ వుంటుంది. ఈ ఊగిసలాటలో కొంత మందిని క్రాస్ ఎగ్జామినేషన్ చేసి, కొంత మంది చెప్పేది మౌనంగా విని, అప్పటికెలా తోస్తే అలా చేస్తూ వుంటుంది. ఇదంతా జ్ఞాపకం చేసుకుని చిత్రమైన తన మనస్థితిని తలచుకుని చిన్నగా నవ్వుకుంది శారద.

చూడవలసిన పేషెంట్స్ ఎవరూ లేక పోవడంవల్ల మెడికల్ జర్నల్ చేతిలోకి తీసుకుంది. ఇంతలో ఒక నడివయసాయన లోపలికొచ్చి నమస్కరించాడు. 'కూర్చోండి' అంటూ తన కెదురుగావున్న కుర్చీ చూపించిందతనికి. ఇంట్లో ఆడవారి ఆరోగ్యం గురించి తన సలహా అడగడాని కొచ్చి వుంటాడని భావిస్తూ, 'చెప్పండి' అన్నట్లుగా అతనివంక చూచింది. అప్పటివరకు పది మడతలు పెట్టివున్న అరఠావు కాగితాన్ని విప్పి దాన్ని సరిచేసి శారదముందు పెట్టాడు. తన ముందున్న కాగితం మీదున్న పద్యాల్ని ఉత్కంఠతతో చదవడం మొదలు పెట్టింది శారద. తన గుణగణాల్ని, కీర్తి ప్రతిష్ఠల్ని, డాక్టరుగా తన శక్తి సామర్థ్యాల్ని అందమైన భాషలో భట్రాజులా పొగిడాడు ఆ పద్యాలలో. చివరి పద్యం కూడ చదివేసరికి ఏదో తెలియని అవస్థలో పడిపోయింది శారద.

"అమ్మా! పిల్ల పెళ్ళి చేయాలి. ఏదో తమకు తోచిన సాయం" అంటూనే వున్నాడతను. శారద మరో ఆలోచన లేకుండా వెంటనే డ్రాయర్ తెరిచి పది రూపాయల నోటు అతని చేతిలోపెట్టడం, అతను దీవిస్తూ బయటకు వెళ్ళిపోవడం, ఒక్కక్షణంలో జరిగి పోయాయి.

మరుక్షణం తెలివితెచ్చుకున్న శారద, జరిగింది గుర్తుకు తెచ్చుకుని, ఆత్మన్యూనతతో కుంచించుకుపోతూ, శిలాప్రతిమలా కూర్చుండి పోయింది.

## స్థిర లక్ష్యం

డాక్టర్ దాశరథి

*తూర్పు తలుపులు తెరచుకోనీ!*
*మార్పు గాడ్పులు పరచుకోనీ!*
*ఎందుకీ శిథిలావనీ గా*
*ఢాంధకార వినద్ధ రజని?*

*బ్రతుకు జాడల మహారణ్యములు,*
*ప్రయాణములో గడచె దినములు;*
*నడచి నడచి పదాలు కందెను,*
*నయనములు జ్వాలదగ్ని కణములు*

*నిదురనే రుచి చూడకుంటివి*
*కదలుటయె నా ధ్యేయమంటివి*
*ఎంతదూరము వెళ్ళినను వి*
*భ్రాంత శూన్య పథమ్మె కంటివి*

*ఎంతకని ఈ పశ్చిమాశా*
*ధ్వాంత కాంతారాభిలాష?*
*ప్రాగ్దిశాంచల సంచలత్ ప్ర*
*భాతమనగా ఏల "ఘోషా"?*

*ముసుగుపై విసుగైన రాదా?*
*ప్రొద్దు కాంచను మనసు లేదా?*
*సూర్యముఖివై తిరుగు! ఔషస*
*తూర్య రుతి వినిపించబోదా?*

*గమ్య మొక దిశ, గమన మొక దిశ*
*గడవదా తుదిలేని ఈ నిశ?*
*సాగిపో! స్థిర లక్ష్యముంటే*
*సమీపములో కలదు శుభ దశ!*